ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

ఆదివారం 21 సెప్టెంబరు 2025

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎంహెచ్‌వో వాణిశ్రీ అన్నారు. స్వస్త్ నారి, సాశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా రాగినేడు పీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 142 మంది మహిళలకు సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు పరీక్షలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రారంభించిన కార్యక్రమంలో భాగంగా మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందనే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యులు శ్రవణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- నేటి నుంచి బతుకమ్మ సంబరాలు
- భక్తిశ్రద్ధలతో ఆడిపాడనున్న ఆడబిడ్డలు
- వాడవాడన హోరెత్తనున్న ఉయ్యాల పాటలు
- పలు పాఠశాలల్లో ఆకట్టుకొన్న ముందస్తు వేడుకలు



పూల పండుగకు వేళాయె..

పెద్దపల్లి కల్చరల్/పాలకుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆడపడుచుల సంబరాల పండుగ బతుకమ్మ రానే వచ్చింది. యువతులు, ముత్తైదువులు ఆడుతూపాడుతూ అరుదైన వేడుక బతుకమ్మ పండుగ. మహాలయ అమవాస్యతో ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగే ఈ పండుగ ఆదివారంతో ప్రారంభం కానుంది. తొమ్మిది రోజులపాటు వివిధ పేర్లతో బతుకమ్మను పూజిస్తారు. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడో రజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నాను బియ్యం బతుకమ్మ, ఐదోరోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ. ఇలా పల్లెవాసుల బతుకుల్లో బతుకమ్మ కదలాడుంది. వారి ప్రతి పనిలో బతుకమ్మ పాట ఉంటుంది. పంటలు చేతికొచ్చే వేళ ప్రతి ఇంట్లో ఒక సంబురం. కొత్త బట్టలు ధరించి బతుకమ్మను పేర్చి ఆడపడుచులంతా ఒక్క చోటకు చేరి ఆడుతుంటే కళ్లార్పకుండా చూడాల్సిందే. తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపంగా వెలుగొందే బతుకమ్మ పండుగ వేడుకలు మహాలయ అమావాస్యతో ప్రారంభ మై ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి మహర్నవమి వరకు కొనసాగుతాయి. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక్క చోటుకు చేర్చి ఇద్దరక్క చెల్లల్ల ఉయ్యాలో ఒక్కఊరికించి ఉయ్యాలో, ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మ అంటూ అమ్మను ఆరాధించేందుకు పల్లెల్లో ఆడబిడ్డలు సిద్ధమవుతున్నారు.

● పల్లెలే ప్రతీకలు....

తరతరాల సజీవ సంస్కృతులు, సంప్రదాయాలకు పల్లెలు ప్రతీకలు. ప్రకృతి శక్తికి, భక్తికి ఆచారాలను, సం ప్రదాయాలను దైవత్వంతో ముడిపెట్టి తమను వైపరీ త్యాలకు గురి చేయొద్దంటూ వేడుకోవడమే పండుగల పర మార్థం. దీంతోపాటు ఆత్మీయత, అనుబంధాలను చాటి చెప్పే బతుకమ్మ పండుగను పిల్లలు. పెద్దలు కలిసిమెలిసి జరుపుకొంటారు. తమ పసుపు, కుంకుమలను పదికాలాల పాటు చల్లగా ఉండాలని గౌరమ్మకు మహిళలు పూజలు చేస్తారు.

● కొత్త బట్టలు.. పుట్టింట్లో సందడి...

తొమ్మిదిరోజులు సాయంత్రం వేళ మహిళాలంతా రకరకాల పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకుని ప్ర. దాన కూడళ్లలో గుండ్రంగా తిరుగుతూ ఉయ్యాల పాటలు పాడుతూ బతుకమ్మ ఆట ఆడుతారు. కొత్తగా పెళ్లయిన ఆడపడుచులు అత్తింటి నుంచి పుట్టింటికి వెళ్లడానికి ఎంతో ఆసక్తిగా వెయ్యికళ్లతో ఎదురు చూసే పండుగ బతుకమ్మ.



● బతుకు పాటల బతుకమ్మ....

బతుకమ్మ పండుగ గురించి తెలంగాణ పల్లెల్లో పాడుకునే పాటల్లో పలు అంశాలతోపాటు చారిత్రక నేపథ్యమైన కథలు ప్రచారంలో ఉన్నాయి. ఓ పురాణ గాథ ప్రకారం.. జగన్మాత మహిషాసురుడిని వధించిన అనంతరం అలసిపోయి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజు

(మిగతా 8వ పేజీలో)

నిందితులకు శిక్ష పడితేనే నేరాలు తగ్గుతాయి



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిందితులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని రామగుండం సీపీ అంబర్‌కిశోర్ ఝా అన్నారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో పని చేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేరస్థులకు శిక్ష పడే విధంగా సాక్ష్యులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలని, కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా కోర్టు కానిస్టేబుళ్లు మెదలాలని, దోషులకు శిక్ష పడడంలో కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత కీలకమైందన్నారు. నేరస్థులకు వారెంట్లు, సమన్లు సత్వరమే జారీ అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని, కోర్టు ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు, సూచనలు పాటించాలని, కోర్టులో పెండింగ్‌లో ట్రయల్ కేసులు, సమన్లు సీసీటీ ఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. ఏసీపీ రమేష్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, లీగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సీసీఆర్‌బీ ఎస్ఐ చంద్రకుమార్, సీసీ హరీష్‌తో పాటు పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా భీమారం చెందిన మూగ, చెవిటి బాలికను అత్యాచారం చేసిన కేసులో దోషికి శిక్ష పడేందుకు కృషి చేసిన అనువాదకుడు యేసేపును సీపీ అభినందించారు.

రామగుండం నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి



కలెక్టర్ శ్రీహర్షతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్షను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. విద్య, వైద్యం, రహదారులు, ఎస్‌టీపీల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకోవాలని, కాలువలు, పార్కులు, వీధి దీపాల పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో లారీ యజమానులకు 20శాతం యూరియా లోడింగ్ ఇచ్చే విధంగా అగ్రిమెంట్ చేయాలని, పార్కింగ్‌యార్డు వద్ద పెట్రోల్ బంక్, యార్డు నీట మునుగుతుందని, దీనికి శాశ్వతచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు కందూరి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

కలెక్టర్‌పై ఆరోపణలను ఖండిస్తున్నాం



టీ-జాక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో నిరసన ప్రదర్శన

పెద్దపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కోయ శ్రీహర్షపై నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని జిల్లా టీ-జాక్ చైర్మన్ బొంకూరి శంకర్ తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసన ప్రదర్శన చేశారు. టి జాక్ చైర్మన్ మాట్లాడుతూ రామగుండంలోని ఒక ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు వారి సొసైటీకి 10 గుంటల భూమి కేటాయించడానికి జిల్లా సంక్షేమ అధికారి ద్వారా కలెక్టర్ డబ్బులు అడుగుతున్నారని ఆరోపించడం సరైంది కాదన్నారు. కలెక్టర్‌పై అసత్య ప్రచారం చేయడం వల్ల ఉద్యోగుల మనో ధైర్యం దెబ్బ తీయడమేనని అన్నారు.

కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రభుత్వ పాఠశాల, సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలలో విద్యార్థులకు తగిన వసతుల కల్పించేందుకు కావాల్సిన నిధులు విడుదల చేస్తూ నాణ్యమైన విద్యను అందించేలా చేస్తున్నారని అన్నారు. జిల్లా అధికారులు వీర బుచ్చయ్య, మాధవి, రవీందర్, ప్రభాకర్, డాక్టర్ వాణిశ్రీ, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు

లక్ష్యానికి చేరువలో సీఎంఆర్..

- ఖరీఫ్‌లో 98 శాతం, రబీలో 54 శాతం పూర్తి
- రాష్ట్రంలో రెండు, మూడో స్థానంలో జిల్లా
- బ్యాంక్ గ్యారంటీ విధానం, అధికారుల పర్యవేక్షణతో వేగం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ లక్ష్యానికి చేరువలో నడుస్తున్నది. గత ఏడాది నుంచి సంబంధిత అధికారులు రైస్‌మిల్లర్లపై పర్యవేక్షణ పెంచడంతోపాటు ప్రభుత్వం తీసుకవచ్చిన బ్యాంక్ గ్యారంటీ విధానం వల్ల కస్టమ్ మిల్లింగ్ వేగంగా జరుగుతున్నది. కస్టమ్ మిల్లింగ్‌లో రాష్ట్రంలో జిల్లాను మూడు, నాలుగు స్థానాల్లో నిలిచేలా చేశారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ 98 శాతం పూర్తి కాగా, రబీ సీజన్‌కు సంబంధించి 54 శాతం పూర్తి చేశారు. గతంలో సకాలంలో బియ్యం ఇవ్వని రైస్ మిల్లర్లను బ్లాక్‌లో పెట్టి రెగ్యులర్‌గా బియ్యం ఇచ్చే మిల్లర్లకే అధికారులు ధాన్యాన్ని కేటాయించారు. ధాన్యం కేటాయింపులో అధికారులు ఆచితూచి వ్యవహరించారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం 2,97,379 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు కేటాయించారు. ఇందులో 35 శాతానికి పైగా సన్నరకం వరి ధాన్యం ఉండడం గమనార్హం. కేటాయించిన ధాన్యాన్ని మర ఆడిం చగా వచ్చే 1,99,775 టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు, ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంది. ఆ మేరకు ఇప్పటి వరకు 1,96,392 టన్నుల బియ్యాన్ని (98 శాతం) మిల్లర్లు అందజేశారు. ఇంకా 3,383 శాతం బియ్యం ఇవ్వాల్సి ఉంది. రాష్ట్రంలో 100 శాతం సీఎం ఆర్ పూర్తి చేయడంలో జనగాం జిల్లా ముందు వరసలో నిలవగా, ఆ తర్వాత ఖమ్మం, మహబూబ్‌నగర్ 99 శాతంతో రెండో స్థానం లో ఉండగా, పెద్దపల్లి జిల్లా మూడో స్థానంలో ఉంది. రాష్ట్ర వ్యాప్తం గా ఈ సీజన్‌లో 53,95,077 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లర్లకు ఇచ్చారు. తద్వారా 36,29,860 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 29,98, 003 టన్నులు 83 శాతం సీఎంఆర్ పూర్తి చేశారు. ఇంకా 6,31,857 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది.

● బ్యాంకు గ్యారంటీతో వేగంగా మిల్లింగ్..

ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం గత కొన్నాళ్లుగా రైస్ మిల్లర్లకు ఇస్తున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైస్‌మిల్లర్లకు ఇచ్చిన ధాన్యంకు సంబంధించి ఎలాంటి గ్యారంటీలు లేకుండానే ఇచ్చింది. దీనిని ఆసరా జేసుకుని పలువురు మిల్లర్లకు తమకు కేటాయించిన ధాన్యాన్ని సకాలంలో మర ఆడించి బియ్యం ఇవ్వాల్సి ఉండగా, బహిరంగ మార్కెట్‌లో ధాన్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకు న్నారు. వాటిని రికవరీ చేసేందుకు అధికారులు తంటాలు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంఆర్ విధానంలో పలు మార్పులు తీసుకవచ్చింది. ఎలాంటి రిమార్క్ లేని మిల్లర్లకు కేటాయించే ధాన్యంలో 10 శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని, గతంలో బియ్యం సకాలంలో అందజేయక పెనాల్టీలు పడ్డ మిల్లర్లకు ధాన్యం కేటాయించాల్సి వస్తే 25 శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలనే నిబంధన విధించారు. దీంతో రైస్‌మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇచ్చిన తర్వాతనే వారికి అధికారులు ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. బ్యాంకు గ్యారంటీల భయంతో మిల్లర్లు సీఎంఆర్ అందించడంతో వేగం పెంచారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్, డీఎస్ఓ, జిల్లా అదనపు కలెక్టర్‌లు ఎప్పటికప్పుడు సీఎంఆర్‌ను పరిశీలిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. ఈ విషయమై పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్‌రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ బ్యాంకు గ్యారంటీతోపాటు తమ పర్యవేక్షణ వల్ల సీఎంఆర్ వేగంగా సాగుతున్నది. ఖరీఫ్ సీజన్ సీఎంఆర్ ముగింపు దశకు చేరుకున్నదని, రబీ సీజన్ సీఎంఆర్ కూడా నెల రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

● రబీ సీజన్‌లో 54 శాతం డెలివరీ..

2024-25 రబీ సీజన్‌లో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యంతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన 4,64,038 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించగా, తద్వారా 3,13,226 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 1,69,270 టన్నుల 54 శాతం బియ్యాన్ని ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్ శాఖకు అందించారు. 55 శాతం సీఎంఆర్ పూర్తి చేసి కరీంనగర్, జనగాం జిల్లాలు ముందు వరసలో ఉండగా, పెద్దపల్లి జిల్లా 54 శాతంతో రెండవ వరసలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 74,21,876 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, 50,09,766 టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 19,20,341 టన్నుల 38 శాతం బియ్యం ఇచ్చారు. ఆయా జిల్లాలతో పోలిస్తే జిల్లాలో రెండు సీజన్ల నుంచి సీఎంఆర్ వేగంగా జరుగుతున్నది. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ మిల్లర్లను తనిఖీ చేస్తూ కస్టమ్ మిల్లింగ్ రైస్ త్వరగా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

● పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. స్థానిక నందన గార్డెన్‌లో నియోజకవర్గ పరిధిలోని 820మంది సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయనిధి) లబ్ధిదారులకు 2 కోట్ల 64 లక్షల 6వేల 9వందల రూపాయల చెక్కులను అందజేశారు. అలాగే 113 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు కోటి 33 లక్షల 15వేల 428 రూపాయల విలువ గల చెక్కులను శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసేవలను అందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి పిలునిచ్చారు. కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అధునాతన హంగులతో ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలకు ఆధునికీకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకునే వారికి అన్ని రకాల సౌకర్యాలను తమ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేశామని, ప్రజలందరూ స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రత్యేక దృషి సారించి అభివృద్ధి పరుస్తున్నారని గుర్తు చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని హంగుల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని వివరించారు. రానున్న రెండేళ్ల కాలంలో పెద్దపల్లి రూపురేఖలు మారనున్నాయని ఆశాభావం వ్యక్త చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నర్సింగ్ సిబ్బందిపై ప్రిన్సిపాల్ ఒత్తిడి

- పిడియాట్రిక్ ఎన్నికల్లో ప్రిన్సిపాల్ పోటీ
- ఓట్ల కోసం పిడియాట్రిక్ వైద్యులకు ఫోన్, మెసేజ్ చేయాలని వేధింపులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇండియన్ అకాడమీ పిడియాట్రిక్ ఎన్నికలు జాతీయ స్థాయిలో అక్టోబరులో జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పోటీ చేస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పని చేసే ఆరుగురు స్టాఫ్ నర్సులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని ఒత్తిడి చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. నర్సింగ్ స్టాఫ్ రోజూ దేశ వ్యాప్తంగా పిడియాట్రిక్ వైద్యులకు ఫోన్ చేసి డాక్టర్ హిమబిందు పోటీలో ఉందంటూ, మీ ఓటు వేయాలంటూ ఫోన్లతోపాటు మెసేజ్‌లను ఫార్వర్డ్ చేస్తున్నారు. రోజుకు 1000 నుంచి 1200మంది వైద్యులకు ఫోన్ చేయాలంటూ ఇబ్బందులకు గురి చేస్తోందని పేర్కొంటున్నారు. దీంతో కొందరు సిబ్బంది సెలవులో వెళ్లినట్లు తెలుస్తుంది. వర్షాకాల సీజన్‌తో ప్రభుత్వాసుపత్రికి రోగుల తాకిడి పెరగడంతో నర్సింగ్ సిబ్బంది చేత ప్రచారం నిర్వహించడంపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికలు ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా నిర్వహించనున్నారు. వైద్య విద్యార్థులకు పరీక్షలు జరుగుతుండగా ప్రిన్సిపాల్ మాత్రం ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉంది. ఉదయం 9గంటల నుంచి రాత్రి 11గంటల ఫోన్లు, మెసేజ్‌లు చేయిస్తుండడంతో కుటుంబ సభ్యులను చూసుకోలేక మానసికంగా వేదనకు గురవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గాలిలో కలిసిన గల్ఫ్ ఆశలు

● ఇంటర్వ్యూకు వెళ్లివస్తూ యువకుడి హఠాన్మరణం



ప్రశాంత్(ఫైల్)

గంభీరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం గోరంటాలకు చెందిన ప్రశాంత్(28) గల్ఫ్‌దేశాలకు వెళ్లేప్రయత్నంలో హఠాన్మరణం చెందడం కలిచివేసింది. బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లేందుకు ప్రశాంత్ సిద్ధమయ్యాడు. దుబాయి వెళ్లేక్రమంలో ఆ కంపెనీ వారు జగిత్యాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ పాల్గొన్నారు. తిరిగి జగిత్యాలనుంచి గోరంటాలకు వస్తుండగా, ప్రశాంత్ ఛాతీలో నొప్పివచ్చి గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన ప్రశాంత్‌ను కరీంనగర్‌కు చికిత్స కోసంతరలించారు. ప్రశాంత్అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. ప్రశాంత్‌కు భార్య, ఏడాదిన్నర కొడుకు ఉన్నారు. మృతుడు ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బరుకుటం తిరుపతి, ప్రధానకార్యదర్శి శనిగరం నరేశ్‌వర్మ, స్వామి, శంకర్, రాజు, అనిల్, మల్లేష్ తదితరులు ప్రశాంత్ కుటుంబాన్ని పరామర్శించారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో శనివారం రాత్రి పోలీస్ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. టౌన్‌ఎస్సై రవికిరణ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా భీమారం మండల కేంద్రానికి చెందిన లింగాల దీపక్, లకుమల్ల కార్తీక్ అనే ఇద్దరువ్యక్తులు కారును అతివేగంగా నడుపుతూ పోలీసులపైకి దూసుకువచ్చారు. వారికి డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేసే క్రమంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ దురుసుగా ప్రవర్తించారు. టౌన్‌పోలీస్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ పేర్కొన్నారు.

మల్యాల ఎస్సైపై ఫిర్యాదు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల ఎస్సై నరేష్ కుమార్‌పై కఠినచర్యలు తీసుకోవాలని చొప్పదండి మాజీఎమ్మెల్యే రవి శంకర్ శనివారం ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. గంగాధర మండలం హిమ్మత్‌రావు గ్రామానికి చెందిన బండారిశ్రీనివాస్ అనే యువకుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకుగాను ఎస్సై పోలీస్ స్టేషన్‌కు యువకుడిని తీసుకవచ్చి చిత్రహింసలకు గురిచేసినట్లు మాజీఎమ్మెల్యే ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా అట్రాసిటీ కేసు నమోదు చేశారని వివరించారు. రవి శంకర్ వెంట మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు ఐల్నేని సాగర్ రావు, కోరుకంటి రాము తదితరులు ఉన్నారు.



గుట్టుగా గుడుంబా

- రహస్య ప్రాంతాల్లో తయారీ
- పల్లెల నుంచి పట్టణాలకు రవాణా

ఎల్లారెడ్డిపేట/ వీర్నపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని మారుమూల పల్లెల్లో గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. దసరా పండుగతో పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఏ గ్రామంలో చూసినా గుట్టుగా గుడుంబా తయారవుతోంది. గుడుంబాను కట్టడి చేసేందుకు ఆబ్కారీ అధికారులు, పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నా దందా నడుస్తూనే ఉంది. మద్యం కంటే సారా తక్కువ ధరలకు లభిస్తుండడంతో దినసరి కూలీలు ఎక్కువగా వాడుతున్నారు. రహస్య ప్రాంతాల్లో పగలు, రాత్రంతా సారా తయారు చేస్తున్నారు.

● పెద్ద ఎత్తున బెల్లం, పటిక కొనుగోళ్లు

ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, కిష్టునాయక్ తండా, గుండారం, మద్దిమల్ల, బంజేరు, లొద్దితండా తదితర గిరిజన తండాల్లోని పలువురు రానున్న దసరా పండుగను దృష్టిలో పెట్టుకుని కామారెడ్డి, సిరికొండ, నిజామాబాద్, మాచారెడ్డి, రాచర్లగొల్లపల్లి తదితర పట్టణాల నుంచి సారా ముడి సరుకులైన బెల్లం, పటికను కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు చిన్నపాటి సంచుల్లో నింపుకుని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్నారు. తండాల్లోని శివారు ప్రాంతాల్లో గుడుంబా తయారు చేస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో బెల్లం పానకం, ఇప్పపువ్వు పులియ బెట్టి నిల్వ చేస్తున్నారు. వాటి నుంచి బట్టీల ద్వారా సారాను తయారు చేస్తున్నారు. నిత్యం ఆయా గ్రామాల్లో వందల లీటర్ల సారా తయారవుతోంది. అధికారులు దాడులు జరిపి కేసులు నమోదు చేసినా గుడుంబా తయారీ మాత్రం ఆగడం లేదు.

● పట్టణాలకు రవాణా

తండాల్లో తయారవుతున్న సారాను గ్రామాలు, పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు కామారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్ పట్టణాలు, పల్లెలకు తరలించి వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. స్థానికంగా అమ్మకాలు సాగిస్తున్నారు. లీటరుకు రూ. 100 చొప్పున విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుండడంతో దినసరి కూలీలు సారాకు ఎగబడుతున్నారు.



బట్టిపై తయారు చేస్తున్న సారా

● దాడులు చేసినా.. ఆగని దందా

మండలాల్లోని పలు గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు వరుస దాడులు చేసినా సారా దందా ఆగడం లేదు. ఇటీవల అల్మాస్‌పూర్, కిష్టునాయక్‌తండా, మద్దిమల్ల, భూక్య తండా, గర్జనపల్లి తదితర గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. పక్షం రోజుల్లో 4వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 4 క్వింటాళ్ల ఇప్పపూవు, 200 లీటర్ల సారా, 20 కిలోల పటికను స్వాధీన పర్చుకున్నారు. 16 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు 10 మందిని బైండోవర్ చేశారు.

ప్రత్యేక తనిఖీలను ముమ్మరం చేస్తాం

- శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, కోనరావుపేట, ముస్తాబాద్ మండలాల్లోని గిరిజన తండాల్లో తనిఖీలను ముమ్మరం చేస్తాం. దసరా పండుగ నేపథ్యంలో దాడులను నిర్వహించి సారా తయారీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. బెల్లం అమ్మకాలు సాగిస్తున్న కిరాణ దుకాణాల్లో సోదాలు నిర్వహిస్తాం. కేసులు నమోదు చేయడంతో పాటు తయారీదారులు, విక్రేతలకు అవగాహన కల్పిస్తాం.

పాము కాటు.. ఆసుపత్రికి తరలింపు

జూలపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన అట్ల ఓదెలు అనే వ్యక్తి శనివారం ఉదయం ఇంటి ఆవరణలో ఉన్న పైపులను తీస్తుండగా చేతిపై పాము కాటు వేసింది. దీంతో ఓదెలు అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం ఓదెలు ఆరోగ్యం మెరుగైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఇల్లందకుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్లో శనివారం మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బూజునూర్ గ్రామానికి చెందిన కనకం అంకుష్ ఈనెల17న హైదరాబాద్‌లోని బంధువుల సంవత్సరీకానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో అంకుష్ భార్య రజిత బంధువుల ఇళ్లలో వాకబు చేసింది. అయినా ఎలాంటి ఫలితం లేదు. ఈ మేరకు రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కారును ఢీకొన్న ట్రక్కు

మల్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల అంగడిబజారు ప్రాంతంలో శనివారం ఆగిఉన్న కారును సిమెంట్, కాంక్రీట్ మిక్సర్ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం దెబ్బతినగా ఢీకొన్న సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఘర్షణలో అడ్డువెళ్లిన వ్యక్తికి కత్తిపోట్లు

కోల్‌సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కృష్ణనగర్‌లో శనివారం సాయంత్రం సొల్లు కుమారస్వామి అనే వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మీనుగు వేణు, ఫొటోగ్రాఫర్ భాస్కర్ మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం వేణు మద్యం మత్తులో భాస్కర్ ఇంటికి వచ్చి గొడవ పడుతుండగా భాస్కర్ తోడళ్లుడు కుమారస్వామి వారించాడు. భాస్కర్‌కు మద్దతు ఇస్తున్నాడనే కోపంతో వేణు కుమారస్వామిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘర్షణలో వేణుపై భాస్కర్ రాయితో దాడి చేయడంతో అతని తలకు గాయమైంది. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి క్షతగాత్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుమారస్వామి ఆర్ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు.



కత్తిపోటుకు గురైన కుమారస్వామి

దారుణ హత్యకు గురైన మాజీ కౌన్సిలర్



రమేష్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని నాంపల్లి నందికమాన్ ప్రాంతంలో మాజీ కౌన్సిలర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి సిరిగిరి రమేష్(54) దారుణ హత్యకు గురైన ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. రమేష్‌కు సన్నిహితంగా ఉండే వ్యక్తులే హత్య చేసినట్లు తెలుస్తోంది. ఈ హత్యకు పాల్పడినవ్యక్తి పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన రమేష్‌ను పథకం ప్రకారం శుక్రవారం వెంచర్‌కు పిలిచి హత్య చేసినట్లు తెలుస్తోంది. ఉదయమే ఇంటి నుంచి వెళ్లిన రమేష్‌కు భార్య అనీల సాయంత్రం 3గంటలకు ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చినట్లు తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ హత్యకు భూ వివాదాలే కారణమని పోలీసులు తేల్చారు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 25ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతని భూములపై తరచూ వివాదాలు ఉండడం వల్ల పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. హత్యకు గల పూర్తి కారణాలను త్వరలోనే వెల్లడిస్తామని ఏఎస్పీ వెల్లడించారు. ఆమెవెంట రూరల్ సీఐ శ్రీనివాస్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

పర్మిట్‌రూంలో అంగన్‌వాడీ కోడిగుడ్లపై డీడబ్ల్యూవో విచారణ

హుజూరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని ఓ పర్మిట్ రూమ్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లు ప్రత్యక్షంపై శనివారం డీడబ్ల్యూవో సరస్వతీ విచారణ చేపట్టారు. పట్టణంలోని కరీంనగర్‌రోడ్‌లోని ఓ పర్మిట్‌రూమ్ వద్దకు డీడబ్ల్యూవో సరస్వతీ, ఎక్సైజ్ ఎస్ఐ వినోద్, సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్లు వెళ్లారు. అప్పటికే షాపుయజమాని శ్రీనివాస్ దుకాణాన్ని మూసి వెళ్లిపోయాడు. దీంతో డీడబ్ల్యూవో షాపు యజమానిని పిలిపించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించడంతో శ్రీనివాస్‌ను పిలిపించారు. కోడిగుడ్లు ఎక్కడి నుంచి వచ్చాయని శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. రంగాపూర్ గ్రామం నుంచి వచ్చాయని తెలియడంతో అక్కడి అంగన్‌వాడీ కేంద్రానికివెళ్లి రికార్డులను పరిశీలించారు. ఈ కోడిగుడ్లు రంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రం నుంచి వచ్చాయని విచారణ తేలింది. అనంతరం డీడబ్ల్యూవో సరస్వతీ విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ కోడిగుడ్లు పర్మిట్‌రూమ్‌లకు వచ్చాయన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి సంబంధిత అంగన్‌వాడీసిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. హుజూరాబాద్ డివిజన్‌లోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లపై తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది తప్పులు చేస్తే సహించేది లేదన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో సరస్వతి

కాకతీయ కాలువలో ఫార్మాసిస్టు మృతదేహం

చొప్పదండి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్నకొండ శివారులో చిట్యాలపల్లికి వెళ్లే కాలువవంతెన వద్ద కాకతీయకాలువలో జగిత్యాల ప్రభుత్వఆసుపత్రి ఫార్మసిస్టు మృతదేహం లభ్యమయింది. కాలువలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మృతుడి వద్ద దొరికిన పర్స్, సెల్‌ఫోన్ ఆధారంగా జగిత్యాల తులసీనగర్‌కు చెందిన ఆవారి అమరేందర్(55)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. కాగా మృతుడు శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోనుంచి వెళ్లిపోగా శనివారం ఉదయం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పిడుగు లచ్చమ్మ(80) అనే వృద్ధురాలు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. లచ్చమ్మకు కొంతకాలంగా మానసిక స్థితి బాగాలేదు. శనివారం ఉదయం గదిలోకి వెళ్లి ఉరి వేసుకొని మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు సదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

సింగరేణి ఉద్యోగి బలవన్మరణం



పవన్‌కుమార్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలో శనివారం తెల్లవారుజామున తప్పెట్ల పవన్‌కుమార్(27) అనేసింగరేణి ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాను నివాసం ఉంటున్న క్వార్టర్ బెడ్‌రూం సీలింగ్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడు మహబూబాద్‌జిల్లా మల్యాల గ్రామస్థుడు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వివాహ విషయంలో చోటు చేసుకున్న ఘటనలే పవన్‌కుమార్ మృతికి కారణమని తెలుస్తున్నది.

తల్లి మందలించడంతో యువతి ఆత్మహత్య

పాలకుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో శనివారం వ్యవసాయ బావిలో పడి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన మొండయ్య అత్త మూడురోజుల క్రితం మృతి చెందింది. మొండయ్యకు కుమారుడు, కూతురు రేగుల కవిత(21) ఉన్నారు. మొండయ్య అత్త మృతిచెంది బాధలో కుటుంబ సభ్యులు ఉండగా శనివారం ఉదయం కవిత సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతోంది. దీంతో తల్లి మందలించగా క్షణికావేశానికి గురయిన కవిత సమీపంలోని వ్యవసాయ పడిలో దూకి ఆత్మహత్య చేసుకొంది. తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ స్వామి తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● పోతిరెడ్డిపల్లిలో కార్డన్ సెర్చ్

వీణవంక, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ మాధవి అన్నారు. వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కార్డన్ సెర్చ్‌లో 22 ట్రాక్టర్లు, 18ద్విచక్ర వాహనాలు పట్టుకొని సరైన కాగితాలు లేని వాటికి జరిమానా విధించినట్టు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 3 ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే సహించేది లేదని అన్నారు. మాదక ద్రవ్యాల పట్ల పిల్ల లపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని వయ స్సుకు సంబంధం లేకుండా తీసుకుంటు న్నారని అన్నారు. కార్యక్రమంలో జమ్మికుంటరూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి, ఇల్లంతకుంట ఎస్ఐ క్రాంతి కుమార్, సైదాపూర్‌ఎస్ఐ తిరుపతి, జమ్మికుంట ఎస్ఐ సతీష్, హుజురాబాద్ ఎస్ఐ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోతిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మానకొండూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఆకుల గోపాల్ అనే ఉద్యోగరిత్యా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో కుటుంబంతో నివసిస్తున్నాడు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో ఓ సెల్‌టవర్‌కు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు గోపాల్ ఇంటిపై నుంచి విద్యుత్ అధికారులు విద్యుత్ లైన్‌ను తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న గోపాల్ గోదావరిఖని నుంచి స్వగ్రామానికి చేరుకొని ఇంటిపై నుంచి విద్యుత్ తీగలను తొలగించాలని పలుమార్లు అభ్యర్థించాడు. కాగా జాతీయ రహదారి పనులలో భాగంగా కాంట్రాక్టర్ గోపాల్ ఇంటి వద్ద విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశాడు. ఈ విద్యుత్ స్తంభం నుంచి సెల్‌టవర్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం తన ఇంటిపై విద్యుత్‌సరఫరా చేయవద్దని బాధితుడు పనులను అడ్డుకున్నాడు. దీంతో విద్యుత్ అధికారులకు బాధితుడు గోపాల్ మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ విషయంపై విద్యుత్ ఏఈ లక్ష్మణమూర్తి, బాధితుడు ఒకరిపై ఒకరు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ తీగలను పరిశీలించారు. ఈ విషయంపై చెంజర్ల ఏఈ లక్ష్మణమూర్తిని వివరణ కోరగా పైఅధికారుల సూచన మేరకు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ గోపాల్

అనారోగ్యంతో వివాహిత బలవన్మరణం

పెగడపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం బతికెపల్లి గ్రామానికి చెందిన మన్నె నీరజ(40) అనే వివాహిత శనివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నీరజ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్నిమందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త మన్నె మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మేడిపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలం పసునూర్ గ్రామంలో విద్యుదాఘాతానికి గురై సత్యనాయక్(51) అనేరైతు శనివారం మృతిచెందాడు. సత్యనాయక్ వరిసాగు చేయగా కోతుల బెడద నుంచి రక్షించుకోవడానికి పొలం చుట్టూ ఇనుప తీగను చుట్టి దానికి విద్యుత్‌కనెక్షన్ ఇచ్చాడు. సత్యనాయక్ పొలం ఒడ్డుపైనుంచి వెళ్తున్న క్రమంలో జారి విద్యుత్‌తీగల్లపై పడ్డాడు. గమనించిన కుటుంబీకులు విద్యుత్ కనెక్షన్ తొలగించి చూసేసరికి మృతిచెందాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడికి భార్య భూమిక, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. మృతుడి భార్య భూమిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో పని చేయని ఫ్రీజర్

● కుళ్లిపోయిన మృతదేహం

● ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు

హుజూరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని మార్చురిలో ఫ్రీజర్ పనిచేయకపోవడంతో ఓ మృతదేహం కుళ్లిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో శుక్రవారం ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ కుల్దీప్‌సింగ్ గుండెపోటుతో అక్కడి క్కడే మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి పోలీసులు తరలించారు. ఈ విషయాన్ని వారి కుటుంబసభ్యులకు తెలపగా, హుటాహుటిన బయలుదేరివచ్చారు. రాత్రి ఫ్రీజర్ పనిచేయకపోవడంతో ఉదయం బంధువులు మృతదేహం వద్దకు వెళ్లగా కుళ్లిపోయి దుర్వాసన రావడంతో వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఫ్రీజర్ టెంపరేచర్ సరిగ్గానే చూపిస్తున్నప్పటికీ టెక్నికల్ ఇష్యూ వల్ల పని చేయలేదు. దీనిపై విచారణ జరిపి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువతి ఇంటికి నిప్పు అంటించే యత్నం

● యువకుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఓయువతి ఇంటికి నిప్పు అంటించడానికి యత్నించిన యువకుడిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రాజన్న తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన చెక్కిళ్ల శివసాయికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న 24ఏళ్ల యువతి పరిచయమైంది. శివసాయి తరచూ ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో గతేడాది ఆగస్టులో ఆమె నుంచి రెండుతులాల బంగారు గొలుసును తీసుకున్నాడు. శివసాయి మద్యానికి బానిసగా మారడం, ఏపనీ చేయకపోవడంతో ఆమె దూరంగా ఉంటోంది. దీంతో ఆగ్రహానికి గురైన శివసాయి ఈనెల7నఅర్ధరాత్రి తన స్నేహితుడితో కలిసి యువతి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పెట్రోల్‌పోసి ఇంటికి నిప్పంటించే ప్రయత్నం చేశాడు. పెట్రోల్ వాసనరావడంతో ఆమె కుటుంబ సభ్యులు కేకలువేశారు. దీంతో నింది తుడు అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో శివసాయిని అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు.



నిందితుడు శివసాయిని అరెస్టు చేసిన ఎస్ఐ రాజన్న

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పురాణిపేట ప్రభుత్వపాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిని సస్పెండ్‌చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల పాఠశాలనుంచి జగిత్యాల పురాణిపేట పాఠశాలకు ట్రాక్టర్‌లో ప్రమాదకర రీతిలో ఫర్నీచర్‌ను విద్యార్థులతో తరలించడంపై సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అకారణంగా తనను తిడుతూ దాడి చేసినవ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన పిల్లి సుజాత శనివారం పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఈనెల7న కొండాపూర్‌కు చెందిన పిల్లిరమేష్ మద్యం మత్తులో తనను తిడుతూ బండరాయితో దాడి చేశాడంది. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపింది.

రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టిన బైక్

● ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కేసీఆర్‌నగర్ కాలనీ వద్ద కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి దాటుతున్న ఓ మహిళను శనివారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో కేసీఆర్‌నగర్ కాలనీకి చెందిన మహిళ కళావతి, తిమ్మాపూర్ గ్రామంలోని వాహనదారుడు చెక్కల వేణు తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను అక్కడున్న వారు ఓ ఆటోలో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వేణు తన బైక్‌పై ఎల్లారెడ్డిపేట నుంచి తిమ్మాపూర్ వైపునకు వెళుతూ రోడ్డు దాటుతున్న మహిళ కళావతిని అతి వేగంగా ఢీకొట్టాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ స్వప్నరాణి


విద్యార్థులతో కలిసి సేవ కార్యక్రమాల్లో పాల్గొన్న స్వప్నరాణి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ స్వప్నరాణి సూచించారు. శనివారం హన్మంతునిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ స్వప్నరాణి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరకుండా ఉంటాయన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యదర్శి అశోక్, న్యాయవాదులు శరత్‌కుమార్, ఆర్.ఝాన్సీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సదయ్యపాల్గొన్నారు. గౌరెడ్డిపేట బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నరహరి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి దీపం ఇల్లాలు

• నేడు భార్యను ప్రశంసించే రోజు



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ఏ ఇంటికైనా దీపం వంటిది ఇల్లాలు. అనాది కాలం నుంచి మన దేశంలో స్త్రీలకు ప్రాధాన్యం ఉంది. సమాజంలో తల్లిగా, చెల్లిగా, భార్యగా, స్నేహి తురాలిగా పలు పాత్రలను పోషిస్తూ పురుషుని విజయాల వెనుక అద్భుత, అదృశ్య శక్తిగా కుటుంబ, సమాజ అభ్యున్నతికి పాటుపడుతున్న స్త్రీని సముచితంగా గౌరవించడంతో పాటు ప్రశంసించడం కూడా తప్పనిసరి. ప్రతిఫలం ఆశించకుండా అన్ని పనులు నిర్విరామంగా చేసే ఏ స్త్రీ అయినా ముఖ్యంగా భార్య కోరుకునేది ఒక ప్రోత్సాహం. ఓ మెప్పు కోలు. ఎలా మెచ్చుకుంటారు? ఏమి చేస్తారనేది ముఖ్యం కాదు. హృదయంలో ఎంత చోటిచ్చారనేదే ముఖ్యం. ఈ సంప్రదాయం ఇంటి నుంచే మొదల వ్వాలని భార్యను ప్రశంసించేందుకు ఓ ప్రత్యేక రోజును కేటాయించారు. ప్రతీ యేటా సెప్టెంబరు నెల మూడవ ఆదివారం జరుపుకునే ఈ రోజు భార్య చేసే పనిని గుర్తించడానికి, ఆమె ప్రేమ, మద్దతును అభినందించడానికి ఒక చక్కని అవకాశం.

భార్యను అభినందించడానికి పలు మార్గాలు..



పలు అంశాలతో కూడిన నిజమైన హృదయ పూర్వక లేఖ రాయాలి. బాధ్యతలు లేని విశ్రాంతితో గల ఓ రోజును కేటాయించాలి. ఆమె ఇష్టాలకనుసారంగా ఒక రోజును ప్లాన్ చేయాలి. పలు రంగాల్లో రూపాతీతమైన ప్రశంస చేయాలి. ఆలోచనాత్మక హావభావాలను ప్రకటించాలి. ఆమె చెప్పే మాటలు శ్రద్ధగా వినాలి. ఆమె చేసే పనులకు ధన్యవాదాలు చెప్పాలి.

నేపథ్యం...

ఈ దినోత్సవం 2006లో అమెరికాలో ప్రారంభమైంది. పిల్లలు లేని భార్యలను గౌరవించడం లక్ష్యంగా ఉన్నా కాలక్రమేణా దీన్ని భార్యలను ప్రశంసించే రోజుగా సార్వజనీనం చేశారు. దీంతో భావోద్వేగ సంబంధాలు బలపడి భాగస్వాములిద్దరికీ ఆనందం పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

భార్యా భర్తలు హాయిగా జీవించాలి..

ప్రతీ నిత్యం కజ్జాలు, పోట్లాటలతో కాకుండా ప్రేమ, సహనం, అవగాహనతో భార్యా భర్తలు హాయిగా జీవించాలి. కేవలం అవగాహనా రాహిత్యం, ఆధిపత్య పోరుతో ఎన్నో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. పంచాయితీలు, పోలీసు స్టేషన్లు, కోర్టుల వరకు వ్యవహారాలు చేరి సమాజంలో విలువ లేకుండా పోతున్న కుటుంబాలను మనం చూస్తూనే ఉన్నాం. దీనికి పరస్పరం తెలియకుండా చేసుకునే ప్రశంస, ఉమ్మడి కుటుంబ జీవన విధానాలే ఉత్తమ కుటుంబ సౌధానికి పునాదులు. మరి ఇంకేం! భార్యలను ప్రశంసించి, ఓ నవ్వు రువ్వుతూ ఆనందమయ సంసార

ఖని బస్టాండ్ నుంచి బీదర్‌కు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ నుంచి కర్ణాటకలోని బీదర్‌కు ఈ నెల 23న సూపర్ లగ్జరీ సర్వీస్‌ను నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ 23న రాత్రి 9గంటలకు బయలుదేరి 24న ఉదయం బీదర్‌కు చేరుకుని బీదర్‌లోని శ్రీక్షేత్ర ఝరాణి, నర్సింహస్వామి దర్శనం, రేచింతల్‌లోని వరసిద్ధి వినాయకుని దర్శనం అనంతరం ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి దర్శనం చేసుకుని 24న రాత్రి గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. ఈ సర్వీస్‌కు చార్జి పెద్దలకు 1,600 రూపాయలు, పిల్లలకు 1,250 రూపాయలుగా నిర్ణయించినట్లు, వివరాలకు 7013504982, 7382847596 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళ అదృశ్యం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని రాంనగర్‌కు చెందిన మంజుల అనే మహిళ రెండు రోజుల నుంచి కనపడకుండా పోయిందని రెండో ఠాణా పోలీసులు తెలిపారు.

ఆమె ఆరోగ్యపరిస్థితి సరిగా లేనందున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. మంజులను గుర్తించినవారు టూటౌన్ సీఐ 8712670762నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

దక్షిణ భారత అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక




రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా బాలుర జట్టు, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన తాటిపల్లి బాలికల గురుకుల విద్యార్థులు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరితాదేవి, ఉపాధ్యాయులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత అథ్లెటిక్స్ పోటీలకు కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో డి రణధీర్‌చరణ్, కె స్వామి ప్రతిభ చాటారు. ఈనెల 23 నుంచి 25 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు. అండర్-18 విభాగంలో ఐదు వేల మీటర్ల రేస్‌వాక్‌లో డి రణధీర్‌చరణ్, అండర్-20 విభాగంలో జావెలిన్‌త్రోలో కె స్వామి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ రెండువేల రూపాయలు అందించి అభినందించారు.

● రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు..

మల్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన యం లతిక అనే విద్యార్థిని తైక్వాండో అండర్-14 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం. జి శాంతిరాజు, పీడీ అంకం శేఖర్ తెలిపారు. ఎ విష్ణువర్ధన్ అండర్-17, యం లతిక అండర్-14 విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో జగిత్యాల జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

● జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన, క్రీడలు శాఖ ఆధ్వర్యంలో జగిత్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీఈటీ మధులిక తెలిపారు.

● రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు విద్యార్థిని..

జగిత్యాలరూరల్ (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న పేరాల కృషక అనే విద్యార్థిని ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి చెస్ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ నాగేష్, పీడీలు వినీత్, అజీమ్, ఉపాధ్యాయులు అభినందించారు.

● ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలకు స్పందన


రణదీర్‌చరణ్‌ను అభినందిస్తున్న జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్

కరీంనగర్ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో క్రీడా సమాఖ్య అండర్-19 ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన పోటీలకు 98 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి మధు జాన్సన్ క్రీడలను ప్రారంభించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. పీడీలు, కోచ్‌లు చందు, బి రాజశేఖర్, బానోత్ రాజు, అంజయ్య, సురేష్, రాజు నాయక్, విజయ్ వలీపాషా, సతీష్, పి అనూష్, సయ్యద్ సబీ, తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం సరైన మార్గం

- హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు

కరీంనగర్ లీగల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం సరైన మార్గమని హైకోర్టు న్యాయమూర్తి, గవర్నర్ల బోర్డు, మధ్యవర్తిత్వం, మధ్యవర్తిత్వ కేంద్రం హైదరాబాద్ సభ్యుడు జె శ్రీనివాస్ రావు అన్నారు. మధ్యవర్తిత్వంపై జిల్లావ్యాప్తంగా 90 మంది న్యాయవాదులకు ఐదు రోజులపాటు నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు అతి తక్కువ ఖర్చుతో, అతి తక్కువ సమయంలో పరిష్కరించవచ్చని, దీంతో న్యాయస్థానాలపై భారం తగ్గుతుందని అన్నారు. కక్షిదారులకు డబ్బు, సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు కక్షిదారు లకు మధ్యవర్తిత్వంపై వివరించారు. మధ్యవర్తిత్వం ద్వారా తమ కేసు పరిష్కారం కాకపోతే తిరిగి చట్ట ప్రకారం న్యాయస్థానంలో ఆ కేసును పరిష్కరించుకోవచ్చన్నారు. శిక్షణ పొందిన న్యాయవాదులు మధ్యవర్తిత్వం ద్వారా కేసును విజయవంతంగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన న్యాయవాదులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మెంబర్, సెక్రెటరీ సీహెచ్ పంచాక్షరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె శివకుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేశ్, స్థానిక న్యాయమూర్తులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా


డీజీ సౌమ్య మిశ్రకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆమెకు పోలీసుల గౌరవ వందనం సమర్పించారు. అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి శేష వస్త్రం, అమ్మవారి వస్త్రంతో పాటు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారివెంట జైళ్లశాఖ డీఐజీ సంపత్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఎస్సై ఎల్లగౌడ్, ఆర్ఎస్ఐ రాజు, ఆలయ సూపరింటెండెంట్ నరేందర్, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

శ్రీరాంసాగర్‌కు 2.13 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం శనివారం కొనసాగింది. 39 గేట్లు పైకి ఎత్తి 1,97,010 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,13,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీపాద ఎల్లంపల్లికి 2.52 లక్షల క్యూసెక్కులు..

పెద్దపల్లి (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి శనివారం సాయంత్రం వరకు 2,52,397 క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. దీంతో గోదావరిలోకి 21 గేట్ల ద్వారా 2,21,130 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 20.092 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

మిడ్ మానేరుకు ఏడు వేల క్యూసెక్కులు..

బోయినపల్లి (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు శనివారం 7000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను ప్రస్తుతం 317.89 సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 27.273 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నిలిచిన ఎత్తిపోతలు

ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలను అధికారులు శనివారం నిలిపివేశారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.29 టీఎంసీల నీరు ఉంది. గత నెల19న నీటి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి నాలుగు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోశారు.

నిలకడగా ఎల్ఎండీ నీటి మట్టం

తిమ్మాపూర్ (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయంలోకి వస్తున్న నీటి నిల్వలు తగ్గుతుండటంతో ఎల్ఎండీలో నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది. ఎల్ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645 టీఎంసీల నీరునిల్వ ఉంది. ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో తగ్గుతుండటంతో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎల్ఎండీ రెండు గేట్లు మూసి నాలుగు గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

రాజన్న ఆలయానికి పండుగ శోభ

- ఆలయంలో ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న రాజన్న ఆలయం, ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జం చేస్తున్న మహిళలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద పండుగశోభ నెలకొంది. శనివారం రాత్రి విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. దేవినవరాత్రోత్సవాలు, బతుకమ్మ సంబరాలను పురష్కరించుకుని రాజన్న ఆలయ ప్రాంగాణాన్ని విద్యుత్ దీపాలతో అందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి పట్టణానికి చెందిన మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుకుని ఆలయానికి తరలివచ్చారు.

ఆలయ ప్రాంగాణంలోని విద్యుత్ దీపాల అలంకరణలో బతుకమ్మ పాటపాడుతూ కోలాటం ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఆలయానికి బతుకమ్మ ఆడేందుకు వచ్చిన మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

● వైభవంగా మహాలింగార్చన

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం మహాలింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రిని పురష్కరించుకుని స్వామి వారికి ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, పరివార దేవతార్చనలు సాయంత్రం ఆలయంలో మహాలింగార్చన ఘనంగా చేపట్టారు. లింగాకృతిలో దీపాలను వెలిగించి వేదమంత్రోచ్ఛరణలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.


రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా లింగార్చన పూజలు చేస్తున్న అర్చకులు

● ధర్మపురిలో..

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్థానిక వేదపండితులు మహాలింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పనతుల వెంకటరమణశర్మ, మదు శంకర్‌శర్మ, మదు రామశర్మ, జనుమంచి రాములు శర్మ, కొరిడె శంకర్‌శర్మ, పెండ్యాల చంద్రశేఖర్‌శర్మ, పెండ్యాల రాజేష్ శర్మ, అర్చకులు ద్యావళ్ల సాయికుమార్, ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, బొజ్జ రాజగోపాల్‌శర్మ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డిస్కమ్స్ పోటీల్లో రన్నరప్‌గా కరీంనగర్ సర్కిల్


బ్యాడ్మింటన్ రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న కరీంనగర్ సర్కిల్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీల్లో కరీంనగర్ సర్కిల్ రన్నరప్‌గా నిలిచింది. ఈ నెల 18, 19, 20 తేదీల్లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో 27 జట్లు తలపడ్డాయి. ఫైనల్‌లో వరంగల్ జట్టుపై పోరాడి ఓడిన కరీంనగర్ సర్కిల్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. చదరంగం పోటీల్లో 15 జట్లు తలపడగా ఫైనల్‌లో హైదరాబాద్ కార్పొరేట్ ఆఫీస్ జట్టుతో పోరాడి ఓడిన కరీంనగర్ సర్కిల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కరీంనగర్ జట్టుకు జీఆర్ఐడీ అండ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జి సంపత్ కుమార్ ట్రోఫీలను ప్రదానం చేశారు. కరీంనగర్ సర్కిల్ బ్యాడ్మింటన్ జట్టులో పి రామ్మోహన్‌రావు, సీహెచ్ సంపత్, జి శ్రీనివాస్, షేక్ అహ్మద్, బి శ్రీకాంత్, పి రోహిత్‌రెడ్డి, చదరంగం జట్టులో ఎం నాగరాజు, ఎం చంద్రకిరణ్, సీహెచ్ శ్రీకాంత్, ఎస్ రాజ్‌కుమార్, ఓ రాజు పాల్గొన్నారు.

12ఏళ్ల క్రితం జారీ చేసిన..

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ రద్దు

కోల్‌సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యుల వివరాలను దాచిపెట్టి రామగుండం రెవెన్యూ అధికారులు జారీ చేసిన తప్పుడు ఫ్యామి లీ మెంబర్ సర్టిఫికెట్‌ను ఆర్డీవో బీ గంగయ్య రద్దు చేశారు. ప్రొసీడింగ్ సీ2/2996/2025 ద్వారా ఆదేశాలు జారీ చేశారు. గోదావరిఖని మేదరిబస్తీకి చెందిన వేరుకొండ కొమురయ్య విజయనిర్మల సామిల్ పేర వ్యాపారం నిర్వహించేవారు. 2013లో అతడు మరణించాడు. అతనికి భార్య ఎల్లమ్మతో పాటు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. ఇందులో ఒక కుమార్తె మంజుల పేరు లేకుండానే భార్య ఎల్లమ్మ పేర తహసీల్దార్ 2013 డిసెంబరు 31న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేశారు. కుమారుడు శ్రీనివాస్, మిగతా ముగ్గురు సోదరీమణులు, తల్లి అంగీకారం ఉందంటూ సామిల్ లైసెన్స్‌ను తన పేరుపై మార్చుకున్నాడు. కొన్ని సంవత్సరాల తరువాత ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో తన పేరు లేకుండా జారీ చేశారని బయట పడడంతో కుమార్తె వేరుకొండ మంజుల సర్టిఫికెట్‌ను రద్దు చేయాలంటూ కలెక్టర్‌కు ఈ ఏడాది మే 9న దరఖాస్తు చేసుకొంది. దీనిపై కలెక్టర్ రామగుండం తహసిల్దార్‌తో విచారణ జరిపించారు. వేరుకొండ మంజుల స్టడీ సర్టిఫికెట్లు, క్షేత్రస్థాయి విచారణ తరువాత కలెక్టర్‌కు నివేదించారు. ఈ మేరకు సర్టిఫికెట్‌ను రద్దు చేయాలంటూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆర్డీఓకు సూచించారు. దీంతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. అలాగే మంజులను ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాగా, సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు, ఆస్తుల వివాదాల నేపథ్యంలో కొందరు ఫ్యామిలీ మెంబర్లు మాత్రమే సర్టిఫికెట్‌లో చేర్చి జారీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. పూర్తిస్థాయి విచారణ చేయకుండా సర్టిఫికెట్లు జారీ చేయడంపై గతంలోనూ వివాదాలు జరిగాయి. ఇప్పుడు 12ఏళ్ల క్రితం జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ రద్దుకావడం చర్చనీయాంశమైంది.

అటవీ అధికారులను నిర్బంధించిన గ్రామస్థులు

- అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం లేదని నిరసన



ఫారెస్ట్ అధికారులను నిర్బంధించిన గ్రామస్థులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

రుద్రంగి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో అటవీశాఖ అధికారులను గ్రామస్థులు అడ్డుకున్నారు. అటవీ భూమిలోని నీలగిరి చెట్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేయడంతో శనివారం అధికారులు పరిశీలించారు. విచారణ కోసం ఫారెస్ట్ అధికారులు, పోలీసులు గ్రామపంచాయతీ వద్దకు చేరుకోగా గ్రామస్థులు ఎఫ్ఆర్వో ఖలిలోద్దీన్, ఫారెస్ట్ అధికారులను గ్రామపంచాయతీలో నిర్బంధించారు. చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటల పాటు యువకులు, గ్రామస్థులు ఆందోళన చేయడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సీఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడి వారి డిమాండ్‌ను జిల్లా ఫారెస్ట్ అధికారి బాలామణికి తెలిపారు. అన్యాక్రాంతమైన భూముల్లో వెంటనే ప్లాంటేషన్ చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

రామగుండం ఎన్టీపీసీకి సీఐఐ ఎనర్జీ ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ అధికారులు

జ్యోతినగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీకి ప్రతిష్టాత్మక కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఎనర్జీ ఎక్సలెన్స్ 2025 అవార్డు లభించింది. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలలో సమర్థవంతంగా పనిచేసినందుకు రామగుండం ప్రాజెక్టుకు అవార్డును ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు ఎం వంశీకృష్ణ, జి కృష్ణ, సచిన్ బైవార్ అవార్డును అందుకున్నారు. అధికారులను, ఉద్యోగులను ప్రాజెక్టు ఈడీ చందన్ కుమార్ సామంత అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండల పరిధిలో పలు కేటగిరీల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 30 మందిని శనివారం ఎమ్మెల్యే విజయరమణరావు సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించి, మెమోంటోలను ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. మార్కెట్ చైర్మన్ ప్రకాష్‌రావు, ఎంపీడీఓ దివ్యదర్శనరావు, ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య, క్లస్టర్ హెచ్‌ఎంలు రత్నాకర‌రెడ్డి, కవిత పాల్గొన్నారు.

రహదారి మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలి



పరిశీలిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మల్యాల నుంచి మీర్జంపేటకు వెళ్లే దారిలో నక్కలవాగు మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం నాయకులతో కలిసి రోడ్డును పరిశీలించారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేసినా కొట్టుకుపోయి, రాకపోకలకు అంతరాయం కలిగిందన్నారు. మల్యాలలో రైతులు సమ్మక్క, సారలమ్మ గద్దె నుంచి పోచంపల్లి, మల్యాల, జగ్గయ్యపల్లి, ఆరెపల్లి, రాయపేట, ఓదెల మల్లన్న దేవస్థానం వరకు బీఆర్ఎస్ హయాంలో రహదారికి రూ.10.95 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, నాయకులు దేవయ్య, రైతులు వెల్పుల సంపత్, శీలం సుధాకర్ రెడ్డి, కల్లెపల్లి సాగర్, కామిడి వెంకట్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, జక్కె విష్ణు, ఎరబాటి రవి పాల్గొన్నారు.

నవోదయ ఎంట్రెన్స్ పుస్తకాల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఊషన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఏగోలపు కుమార్ గౌడ్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ సదయ్యగౌడ్ నవోదయ ఎంట్రెన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. సదయ్య మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు కొనకటి శ్రీవాణి, బండారి స్రవంతి పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ఎలిగేడు, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో ఈ నెల 22న జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల చందరంగం సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీష్ బాబు తెలిపారు. పడాల చిన్న మల్లయ్య గౌడ్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నామని, సోమవారం ఉదయం 9 గంటలకు రూ.100 ఎంట్రీ ఫీజుతో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గెలుపొందిన 8 మంది క్రీడాకారులకు రూ.6 వేల నగదుతోపాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. వివరాలకు 9494364360 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రొంపికుంటలో మెగా వైద్యశిబిరం

కమాన్‌పూర్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): రొంపికుంటలో శనివారం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సమంత మాట్లాడుతూ ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాలకు చేయూతనిస్తుందన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు విజయ్ కుమార్, సిద్దార్థ్, లహరి, వేముగంటి యుగేందర్ రావు, సీనియర్ ఆఫీసర్ అర్చన, జంవాల్ అయ్యర్, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి పరామర్శ

సుల్తానాబాద్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు తల్లి ప్రేమలత శుక్రవారం రాత్రి మృతి చెందగా మండలానికి చెందిన మాజీ సర్పంచ్‌లు హైదరాబాద్‌లో శనివారం భానుప్రసాద్ రావును పరామర్శించారు. మాజీ సర్పంచ్‌లు రాజేశ్వరరావు, వెంకటరమణారావు,రాజిరెడ్డి, మురళి, ఫకీర్ యాదవ్, పాల్గొన్నారు.

జమ్మి చెట్లు నాటుతాం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఆలయాల్లో జమ్మి చెట్లు నాటుతున్నట్లు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర నాయకులు చెప్పాల రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం పాండవుల గుట్టపై ఉన్న జగత్ మహామునేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వాహకులు బసవత్తుల రాజమౌళితో కలిసి జమ్మి చెట్టును నాటారు. హరితసేన రాష్ట్ర కోఆర్డినేటర్ గర్రెపల్లి సతీష్, మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, వైస్ ఎంపీపీ శిరీష, అనిల్, ఆడేపు శ్రీదేవి రాజు, కర్నాకర్ రావు, రంజిత్ రెడ్డి, శ్రీకాంత్ రావు, దర్మల రవి తదితరులు పాల్గొన్నారు.

పూల పండుగకు వేళాయె...

● పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు, ఖని కృష్ణవేణి స్కూల్‌లో, కృష్ణవేణి విద్యాసంస్థలో, శ్రీచైతన్య స్కూల్ గ్లోబల్‌ఎడ్జ్, శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

(5వ పేజీ తరువాయి)

మూర్ఛపోయిందని, జగజ్జనని స్పృహలోకి రావడానికి వివిధ రీతుల్లో గౌరీదేవిని స్తుతించారని జానపదుల ప్రతీతి.

● ప్రకృతి ఆరాధన..

ప్రకృతిని ఆరాధిస్తూ ఎలాంటి ఆపద రాకుండా ఆత్మస్థైర్యంతో బతుకు పండుగలా సాగాలని గౌరీమాతను పూజించడమే బతుకమ్మ పండుగ. బతుకమ్మను పేర్చాక పసుపుతో గౌరమ్మను తయారు చేస్తారు. బతికించి కోరికలు తీర్చే అమ్మగా గౌరీమాతను పూజిస్తారు. పెళ్లికాని అమ్మాయిలు మంచి భర్త రావాలని, వివాహమైన స్త్రీలు కుటుంబం ఆయురారోగ్యాలతో ఉండాలని బతుకమ్మను పూజించడం పండుగ విశిష్టత.

పలు విద్యాసంస్థల్లో

పెద్దపల్లి కల్చరల్,(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలు జరిగాయి. ట్రినిటి సీబీఎస్ఈ, ప్రైమరీ పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాలల్లో జరిగిన వేడుకల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి పాల్గొన్నారు. గాయత్రి జూనియర్, పీజీ, డిగ్రీ కళాశాలల్లో కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ పాల్గొని బతుకమ్మ గొప్పతనాన్ని వివరించారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ధూళికట్ట గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కరస్పాండెంట్ పద్మాకర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ గ్లోబల్, ఈసాలతక్కళ్లపల్లి జేమ్స్ మోడల్ జీడినగర్ ప్రాంతంలోని యూనివర్సల్ పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా జరిపారు. కరస్పాండెట్లు బుర్ర సత్యంగౌడ్, ప్రిన్సిపాల్ గండు సతీష్, ఇన్‌చార్జి శ్రీరాముల లావణ్య, జాలపల్లి మహేష్, ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్ పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): కాకతీయ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని, ప్రకృతిని కాపాడటం అందరి బాధ్యత అన్నారు. పాఠశాల డైరెక్టర్స్ రవికిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, స్రవంతి, పావని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్యూచర్ గ్లోబల్ పాఠశాలలో

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ గొల్డిబల్బీర్ కౌర్ అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మ ఆడారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గొల్లవాడలో చిన్నారులకు బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. చైర్మన్ అరుణ, హెచ్‌ఎం వాణి పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్‌లోని ఫెంటాస్టిక్ ఫ్రెండ్స్ కిట్టి పార్టీ ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి హాజరై మహిళలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. శైలజ, అక్షర, రజిత, మంజుల, స్వాతి, రజిని, జయశ్రీ, స్వప్న, రోజా పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): ఖని కృష్ణవేణి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థినులు బతుకమ్మ ఆటలు ఆడారు. పూలనే పూజించడం ఒక్క తెలంగాణ సంస్కృతికి దక్కుతుందన్నారు.



వేషధారణలో నవోదయ విద్యార్థులు

రమేష్‌నగర్‌లోని ఉషోదయ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, శ్రీలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఎడ్విన్, పాల్గొన్నారు. శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో అడ్డగుంటపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కరస్పాండెంట్ ఎం.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ వై.యాకాంతం, వైస్‌ప్రిన్సిపాల్ సిహెచ్ రమేష్ పాల్గొన్నారు. సంజయ్‌గాంధీనగర్‌లోని శ్రీచైతన్య హైస్కూల్ గ్లోబల్ ఎడ్జ్ క్యాంపస్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ జోజిరెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ రవివర్మ, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రావణి, ఏవో సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ సమీపంలో గల నవోదయ, జోసెఫ్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ముందస్తు దసరా వేడుకల్లో భాగంగా రావణాసుర వేషధారణతో రాగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు. విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్, నవోదయ, జోసెఫ్ పాఠశాలల డైరెక్టర్లు తిరుపతిగౌడ్, నోయల్ జోసెఫ్, ఉపాధ్యాయులు మధుకర్ రెడ్డి,ప్రవీణ్‌కుమార్, సునీత, స్వప్నజగన్ పాల్గొన్నారు.



కాసులపల్లిలో బతుకమ్మ వేడుకలో విద్యార్థులు



జూలపల్లిలో విద్యార్థుల ర్యాలీ

రామగిరి, (ఆంధ్రజ్యోతి): ప్రగతి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి, పాఠశాల ఇంచార్జ్ కొప్పుల గోవర్ధన్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వచర్ల గ్రామంలో ఆర్ఎస్‌కే ఫౌండర్ రేండ్ల శారద కుమారస్వామి ఆధ్వర్యంలో ఉచిత కుట్టుశిక్షణ మహిళలు బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ బతుకమ్మ విశిష్టత, సాంప్రదాయాల పై ఆర్ఎస్‌కే ఫౌండర్ శారద వివరించారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): కాసులపల్లి ట్రినిటి పాఠశాల, పెద్దకల్వల నోబెల్‌పాఠశాల, బ్రాహ్మణపల్లి శ్రీఆదర్శ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మారేడుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్‌స్త్రీశక్తి అధ్యక్షురాలు అనిత, సభ్యులు పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శీల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్ బతుకమ్మను ఎత్తుకొని వేడుకలను ప్రారంభించారు. ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. సాయి మణికంఠ మాడ్రన్ స్కూల్ ఎండీ జైన రమాదేవి వేడుకల్లో పాల్గొన్నారు. బ్రిలియంట్ మోడల్ స్కూల్ ఎండీ సిరిపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో పాఠశాల నుండి అంబేడ్కర్ చౌరస్తా వరకు బతుకమ్మలతో ర్యాలీ నిర్వహించారు. స్మార్ట్ కిడ్స్ పాఠశాల కరస్పాండెంట్ మహేందర్, ప్రిన్సిపాల్ రమాదేవి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కొత్తూరు విద్యాభారతి పాఠశాల ఎండీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు బతుకమ్మలతో ఆడిపాడారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): న్యూబ్రిలియంట్, జూపిటర్ పాఠశాలల విద్యార్థులు బతుకమ్మ సంబరాల వేడుకలను జరుపుకున్నారు. మండలకేంద్రంలోని ఆయా కూడళ్లలో బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు.



ప్రగతి పాఠశాలలో, ఆర్ఎస్‌కే ఆపన్నహస్తం ఆధ్వర్యంలో, సాయిమణికంఠ పాఠశాలలో, మంథని కాకతీయలో, ఎలిగేడులో బతుకమ్మలతో చిన్నారులు

గుర్తింపు సంఘంగా బీఎంఎస్‌కు అవకాశం ఇవ్వండి



ప్రసంగిస్తున్న మల్లేశం

జ్యోతినగర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలని జాతీయ ఉపాధ్యక్షుడు, ఎన్టీపీసీ ఉద్యోగుల వేతన కమిటీ సభ్యుడు సుంకరి మల్లేష్ అన్నారు. శనివారం రాత్రి జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఉద్యోగుల డిమాండ్లు బీఎంఎస్ కృషి వల్లనే సాధ్యమవుతాయన్నారు. పీఆర్సీ అమలుతో యేటా ఒక్కొక్క ఉద్యోగికి ఎగ్జిక్యూటివ్‌తో సమానంగా నాలుగు లక్షల వరకు పొందగలుగుతున్నట్టు పేర్కొన్నారు. బీఎంఎస్ కృషి మేరకు పీఆర్సీ అమలు జరిగితే ఎన్టీయూసీ తామే అమలు చేయించామని తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. ఫాస్ట్‌ట్రాక్ ప్రమోషన్లు సైతం బీఎంఎస్ సాధించిందన్నారు. ఐఎన్టీయూసీ నాయకులు మోసపూరిత వాగ్దానాలు చేస్తూ, ఇచ్చిన వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. ఎన్‌బీసీ సభ్యుడు రాంనాథ్ గణేష్ మాట్లాడుతూ ఐఎన్టీయూసీ నాయకులు బీఎంఎస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రైవేటీకరణకు పోరాడి అడ్డుకున్న ఘనత బీఎంఎస్‌దని అన్నారు. సంస్థ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ ఉద్యోగికి రెండు లక్షల విలువ చేసే బహుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలన్నారు. భాస్కర్‌రెడ్డి, సాగర్ రాజు, ఉన్నారు.

గ్రామ పంచాయతీ ఎదుట పెన్షన్‌దారుల ధర్నా

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెన్షన్లు పెంచాలని వికలాంగులు, వితంతువులు, వృద్ధులు శనివారం గంగారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్లు పెంచుతామని పెంచడం లేదన్నారు. పెన్షన్లు పెంచకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీల ముట్టడితోపాటు ధర్నా చేస్తామన్నారు. అనంతరం గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు బైరి రామ్మూర్తి, రాచకొండ హేమలత, జీడి పద్మ, మేడి లక్ష్మి, జమున, కనకయ్య, ప్రమీల పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా పెన్షన్లు అందించాలని ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి జల్లి రమేష్ డిమాండ్ చేశారు. ముప్పిరితోట కార్యదర్శి శిరీషకు పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

సింగరేణి లాభాల్లో 35శాతం వాటా ఇవ్వాలి



ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం సీపీఐ ఫ్లోర్‌లీడర్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసి రెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్ కలిశారు. సింగరేణి కార్మికులకు వచ్చే లాభాలను 35శాతం ఇవ్వాల్సిందిగా కోరారు.

పండుగలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

కోల్‌సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ అధికారులకు సూచించారు. శనివారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బతుకమ్మ ఆడే ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలని, మరుసటి రోజే పూలను కంపోస్టు యార్డ్‌కు తరలించాలని, ఆయా ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు పూడ్చడం, తవ్వకాలు జరిగిన చోట పునరుద్దరణ చేపట్టాలని, లైటింగ్ ఏర్పాట్లను చేయాలన్నారు. గోదావరి వంతెనపై దుర్గామాత విగ్రహాలు నిమజ్జనం చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, వంతెనపై లైటింగ్ ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేయాలని సూచించారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే దసరా ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఇంజనీర్ గురువీర్, ఈఈ రామన్, డిప్యూటీ కమిషనర్ వెంకస్వామి అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ ఉమామహేశ్వర్‌తో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణరావు

సుల్తానాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో రెండు రోజులుగా జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడా పోటీలు శనివారం రాత్రి ముగిసాయి. జూనియర్ కళాశాల మైదానంలో అండర్ 14, 17 విభాగాలకు చెందిన బాలబాలికల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు పూర్తి కాగా, విజేతలకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, డీఈఓ మాధవి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రవీందర్, తిరుపతి, మున్సిపల్ కమిషనర్ రమేష్, హైస్కూల్ హెచ్‌ఎం రత్నాకర్ రెడ్డి, జిల్లా క్రీడాశాఖ అధికారి అక్కపాక సురేష్, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్, ఎంఈఓ రాజయ్య, గాజుల రాజమల్లు, మహేందర్, కుమారేకిషోర్, గుణపతి, కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఓదెల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏ రంగంలోనైనా శ్రద్ధ, ఆసక్తి ఉంటే ఉన్నతస్థాయికి ఎదుగుతారని పొత్కపల్లి ఎస్ఐ రమేష్ అన్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పొత్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ఉడత శ్రీవల్లి, ఆళ్ల శరణ్య లను శనివారం ఎస్ఐ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు. ఎస్ఐ మాట్లాడుతూ, క్రీడలు శారీరధారుఢ్య, మానసికోల్లాసానికి ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, పీడీ హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పీఎస్ లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.

నేటి నుంచి దసరా సెలవులు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి అక్టోబర్ 3 వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి తెలిపారు.

యూరియా పంపిణీ

సుల్తానాబాద్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): యూరియా డిమాండ్ నేపథ్యంలో శనివారం రెండు లారీల యూరియాను సుల్తానాబాద్, నీరుకుల్ల గ్రామాల్లోని రైతులకు పంపిణీ చేశారు. కొన్ని రోజులుగా యూరియా కోసం రైతులు ఆందోళన చేస్తుండడంతో మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస ఎమ్మెల్యే విజయరమణరావు సహకారంతో యూరియాను తెప్పించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దశలవారిగా వస్తాయని, అవసరం మేరకు తీసుకుపోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించిన అక్షయ



సుల్తానాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థిని మేరుగు అక్షయ నర్సంపేటలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అక్షయ 2022-23లో బాలికల హైస్కూల్‌లో 10వ తరగతి చదివింది. ఇంటర్ కరీంనగర్ అల్ఫోర్స్‌లో చదివి నీట్‌లో 2364 ర్యాంక్ సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఎంబీబీఎస్ సాధించడంపై అక్షయ తండ్రి స్వామి శనివారం హైస్కూల్‌లో స్వీట్లు పంచారు. పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న మగ్గిడి విజయరావు అక్షయను అభినందించి, ఆమె చదువు పూర్తయ్యే వరకు ఫీజు భరిస్తానని పేర్కొన్నారు. విజయరావును అక్షయ, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఖని మార్కెట్‌లో పూలసందడి



కోల్‌సిటీ టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో ఎంగిలి పూల బతుకమ్మ పర్వదినానికి సర్వసిద్ధమైంది. శనివారం పరిసర పల్లెల నుంచి తీరొక్క పూలు టన్నుల కొద్ది చేరాయి. ప్రధానచౌరస్తాలోతంగెడు పూలు, సీతజడ, గునుగు, గుమ్మడి పూలు, బంతి, చామంతి పూలు విక్రయించారు. ప్రధానచౌరస్తా అమ్మకాలు, కొనుగోళ్ళతో రద్దీగా మారింది. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు జరుగనున్నాయి.

పెద్దపల్లి పట్టణ బ్రాహ్మణ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

పెద్దపల్లి కల్చరల్ సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణ బ్రాహ్మణ సంఘం ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి సత్యనారాయణ తెలిపారు. శనివారం సమావేశమైన సంఘం నాయకులు 2025-27 సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గిరిప్రగడ వెంకట కిషన్‌రావు, ప్రధాన కార్యదర్శి నేదునూరి ప్రభాకర్ రావు, ఉపాధ్యక్షులుగా తాడూరి లక్ష్మన్ రావు, మాచిరాజు లక్ష్మణ మూర్తి, మల్లోజుల ఈశ్వర్ ప్రసాద్‌శర్మ, కోశాధికారిగా ఆదూరి నరసింహారావు, న్యాయ సలహాదారుడిగా ఆలూరి శ్రీనివాస రావు, కార్యవర్గ సభ్యులుగా పెండ్యాల శ్రీనివాస్, నిట్టూరి రవీందర్, మల్లోజుల శ్రీనివాస్, గిరి, శ్రీకాంత్, సురేష్ చందు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. వేద పండితులు భార్గవ శర్మ, సతీష్, మల్లోజుల సత్యనారాయణ శర్మ, రామన్నశర్మ, ప్రవీణ్ శర్మ, రాజేందర్ శర్మ, అంజనీ ప్రసాద్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు రైతులకు సూచించారు. కదంబాపూర్‌లో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. మండల పశువైద్యాధికారి రఘుపతిరెడ్డి పశువులకు పరీక్షలు నిర్వహించారు. మార్కెట్ కార్యదర్శి మనోహర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుమల, రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు అడ్వాన్స్ చెల్లించాలి

రామగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు దసరా అడ్వాన్స్‌కు సెప్టెంబరు మాసంలోని వేతనాన్ని చెల్లించాలని సింగరేణి కోల్ మైనర్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఔట్‌సోర్సింగ్ లేబర్ యూనియన్ సెంట్రల్ సెక్రటరీ ఉడుత శంకర్‌యాదవ్, జనరల్ సెక్రటరీ కిరణ్‌రెడ్డి, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్నలు శనివారం వేర్వేరుగా ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్‌కు వినతి పత్రాలను అందజేశారు.